క్లుప్తంగా

కొనసాగుతున్న పోచమ్మ జాతర



అమ్మవారి పూజలో గ్రామస్తులు

మాడ్గుల: మండల పరిధిలోని అవురుపల్లి గ్రామ సమీపంలోని పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అవురుపల్లి, నల్లవారిపల్లి పరిసర గ్రామాల ప్రజలు వనవాస కార్యక్రమాన్ని నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వహకులు ఆలయాన్ని మామిడాకుల తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మాజీ ఉప సర్పంచ్ రామచంద్రి, సీనియర్ నాయకుడు లాలయ్యగౌడ్, గ్రామస్తులు యాదయ్య, విజయ భాస్కర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం కోశాధికారిగా పాండు



తలకొండపల్లి: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కోశాధికారిగా నీలకంఠం పాండుని నియమిస్తూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నీలకంఠం పాండు ఏబీవీపీలో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు. పాండు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి కట్టబెట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

స్పందన చదువుకు అండగా ఉంటా

శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



స్పందనకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ చదువులో రాణిస్తున్న విద్యార్థిని స్పందన ఉన్నత చదువుకు చేయూతనందిస్తామని శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన జంగమ్మ, పాపయ్య దంపతుల కూతురు స్పందన. హైదరాబాద్‌లో బీఫార్మసీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో కళాశాల ఫీజు చెల్లించలేక స్పందన తల్లిదండ్రులు ఎంపీటీసీ రమేష్‌ను సంప్రదించగా.. ఈ విషియం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో రూ.25,000 ఆర్థిక సహాయాన్ని స్పందనకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, శ్రీశైలం, రఘుపతి, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జుమాతుల్ విదా

కడ్తాల్: పరిధిలోని పలు గ్రామాల్లో రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని(జుమాతుల్ విదా) ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని మజీద్ ఏ ఖుబా, మజీద్ ఏ అర్షద్‌లో మధ్యాహ్నం నమాజ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చివరి శుక్రవారం కావడంతో ప్రత్యేక ప్రార్థనలు, నమాజు నిర్వహించినట్లు ఇమామ్‌లు జహీరుద్దీన్, తహజీబ్ తెలిపారు. ఆయా మజీద్‌ల కమిటీ అధ్యక్షులు రవూఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు జావీద్, కోఆప్షన్ సభ్యుడు జాహంగీర్‌బాబా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, మైనార్టీ నాయకులు జాహంగీర్ అలీ, ఇర్షాద్, వాహబ్, గౌస్, మహబూబ్‌అలీ, సల్మాన్, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్జూరా, పండ్లు పంపిణీ..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు మసీదుల్లో శుక్రవారం సాయంత్రం ముస్లింలకు ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖర్జురా పండ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయా మసీదులలో జరిగిన అల్‌విదా జుమా ప్రార్థనల్లో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. గౌస్, ఖాదర్, మహబూబ్‌అలీ, జహంగీర్, ఖాదర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సత్యం, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఆమనగల్లు పట్టణంలోని పలు మసీదుల్లో రంజాన్‌మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల కమిటీల అధ్యక్షులు మాసూం, గౌస్, ఖాదర్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

'జగ్జీవన్' ఆశయ సాధనకు కృషి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు, చేవెళ్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ నాయకులు వేరువేరుగా నివాళులర్పించారు. షాబాద్‌లో తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమోళ్ల ఆంజనేయులు, పామెన గ్రామంలో ప్రధాన చౌరస్తాలో చిత్రపటానికి మాజీ సర్పంచ్ డీ గోపాల్‌రెడ్డి, హిమాయత్‌నగర్ చౌరస్తాలో చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్‌భరత్, నందిగామలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.



షాద్‌నగర్‌లో నివాలులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



నందిగామలో నివాలులర్పిస్తున్న నేతలు, గ్రామస్తులు



మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్ భరత్, అశోక్‌యాదవ్



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్: నివాళ్లర్పిస్తున్న అక్కమోళ్ల ఆంజనేయులు



శంకర్‌పల్లిలో అరుణోదయసంఘం ఆధ్వర్యంలో నివాళి



చేవెళ్ల: పామెన గ్రామంలో గ్రామ నాయకులు, యువకులు

మాదిగలకు అన్యాయం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మా మాదిగ

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మా మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాదిగ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన సీటును కాపాడుకునేందుకు మాలలతో కుమ్మకయ్యాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాదని కేవలం రెడ్లు, మాలల ప్రభుత్వమని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ సీటును స్థానికేతరుడికి కేటాయించడం బాధాకరమన్నారు. 17 పార్లమెంట్ స్థానాల్లో నాలుగు శాతం లేని రెడ్లకు ఆరు సీట్లు ఏవిధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. 50 శాతానికి ఎక్కువ ఉన్న బీసీలకు రెండు స్థానాలు కేటాయించారని, 12శాతం ఉన్న మాదిగలకు ఒక్క స్థానం కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గట్టగళ్ల ప్రశాంత్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం దిష్టి బొమ్మ దహనం చేస్తున్న పెంటనోళ్ల నర్సింహ్మా మాదిగ

పంచలింగేశ్వర ఆలయంలో పూజలు

చేవెళ్ల: మల్కాపూర్ గ్రామంలోని భువనేశ్వరి సహిత పంచలింగేశ్వర, నవగ్ర, పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవ పూజాకార్యక్రమాలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఉదయం 8 గంటలకు స్వస్తివాచనము, ప్రధాన దేవతాపూజలు, నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాదిమండల దేవతామంత్ర హవనములు, మూలమంత్ర హవనములు, హారతి పంచసూక్త హవనము, చండీ హోమము, దుర్గాసప్తశతి పూజలు కొనసాగాయి. శనివారం చివరి రోజు జగద్గురువులు ఆదిశంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతీ మహాస్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నారని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

దళారులను నమ్మి మోసపోవద్దు

మండల వ్యవసాయాధికారి గోపాల్

నందిగామ: దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి గోపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మండల కేంద్రమైన నందిగామ, చేగూరు పీఏసీఎస్ కేంద్రాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ గోపాల్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర చెల్లిస్తుందని చెప్పారు. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ పాసు బుక్‌తో కొనుగోలు కేంద్రాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, సీఈఓ వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గోపాల్

కాంగ్రెస్‌లో చేరిక

కొందుర్గు: మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన దండోర ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు మీరాపురం వెంకటయ్య శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో సమావేశమైన దండోర నేతలు సతీష్‌మాదిగ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు.

అర్షియాభాను సయ్యదాకు డాక్టరేట్ ప్రదానం

మొయినాబాద్ రూరల్: రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన అర్షియాభాను సయ్యదాకు డాక్టరేట్ ప్రదానం చేశారు. శుక్రవారం మండల పరిధిలో హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో ఆమెకు కులపతి డాక్టర్ సిహెచ్‌వి పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారి సాత్వికారెడ్డిలు డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో 'డిజైన్ సిందాసిస్, యాంటీ క్యాన్సర్ ఎవల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ ఎటేరో సైక్లినిక్ కంపౌండ్స్' అనే అంశంపై డాక్టర్ జె భాస్కర్‌రావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారన్నారు. అనంతరం కులపతి పురుషోత్తమ్‌రెడ్డి, అడ్మినిస్టేట్ అధికారి సాత్వికరెడ్డిలు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, రీసెర్చ్ డీన్ ఆచార్య, కిష్టఫర్, డీన్ సైన్స్ సుందర్‌రామ్, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- భయంతో కాలం వెళ్లదీస్తున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్: అధికారుల అలసత్వమో, నిర్లక్షమో వెరసి ఇళ్ల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో అది ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఇనుప స్తంభాలతో ఏర్పాటు చేశారు. రక్షణగా కంచె కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులు భయం.. భయంగా కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో విద్యుద్ఘాతానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. తాత్కాలికంగా గ్రీన్‌మాట్ కట్టినా అది ధ్వంసమైంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్య నుంచి ట్రాన్స్‌పార్మర్‌ను తొలగించాలని కోరుతున్నారు.

డబ్బులు సకాలంలో చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటయ్య

సీపీఐ మండల కార్యదర్శి వెంకటయ్య

కొందుర్గు: ఉపాధిహామీ కూలీ డబ్బులు సకాలంలో చెల్లించాలని సీపీఐ జిల్లేడ్ చౌదరిగూడ మండల కార్యదర్శి వెంకటయ్య పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపల్లిలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ఐదు వారాలుగా కూలీ డబ్బులు చెల్లించలేదని కూలీలు ఆయన దృష్టికి తెచ్చారు. ఇలాగైతే తమ కుటుంబ అవసరాలు ఎలా తీరుతాయని కూలీలు వాపోయారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని కోరారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పనిప్రదేశంలో కూలీలు సేదతీరడానికి టెంట్, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కృష్ణ, సుధాకర్, రంగయ్య, మల్లయ్య, సత్తయ్య, బాల్‌రాజ్, నారాయణ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు నల్లపూరం నర్సింహారెడ్డి, కొగురి అంజయ్య, అంజిరెడ్డి, చేవెళ్ల వెంకటయ్య, సత్యనారాయణ, బోగుల సత్యం, చీమల నర్సింహులు, వెంకటయ్య, అశోక్‌లు ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి భీంభరత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుబడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కుండువా కప్పి ఆహ్వానిస్తున్న భీంభరత్

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎంపీ రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రాజేశ్‌రెడ్డి

చేవెళ్ల: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎంపీ రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దేవర వెంకట్‌రెడ్డి, బండారి ఆగిరెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్, నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఎంపీ రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్ రాజేశ్‌రెడ్డి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా వేడుకలను జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌గుప్తా, సిద్ధార్థారెడ్డి, వెంకటస్వామి, వెంకటేశ్‌బాబు, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, పాండు, పెంటారెడ్డి, జనార్థన్, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎంపీ రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్ రాజేశ్‌రెడ్డి

అధ్వానం.. గ్రామీణ రోడ్లు

- గుంతలమయంగా రహదారులు
- ఆందోళనలో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చేవెళ్ల: దాదాపు 10ఏళ్లకిత్రం వేసిన గ్రామీణ రోడ్లపైనే వాహనదారులు ప్రయాణిస్తున్నారు. అవి పూర్తిగా గుంతల మయంగా, మట్టి, కంకర తేలి ప్రమాదాలకు నిలయంగా తయారయ్యాయి. అడుగడుగునా గుంతల రోడ్లపై నడక నరకయాతనగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ అన్ని మండలాల్లో గ్రామాల రోడ్లు, ప్రధాన రహదారులు గుంతల మయంగా మారాయి.

చేవెళ్ల మండలంలో...

మండలంలోని 37 పంచాయతీలలో 90శాతం గ్రామాల రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. ఏ గ్రామానికి వెళ్లినా ఇలాంటివే దర్శనమిస్తున్నాయి. పలుమార్లు అధికారులకు, నాయకుల దృష్టికి తీసుకపోయిన పరిస్థితి మారలేదు. వర్షాలకు ఈ రోడ్లు పూర్తిగా దెబ్బతిని బీటీ రోడ్లు మొత్తం కంకరతేలి, గుంతలు ఏర్పడుతున్నాయి. నిత్యం ప్రయాణం చేసే వాహనదారులు ఈ రోడ్లుపై నరకయాతన పడుతున్నారని వాపోతున్నారు. తమ వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పామెన, చనువెళ్లి, బస్తేపూర్, మీర్జాగూడ, ఆలూరు, ఖానాపూర్, ముడిమ్యాల, కమ్మెట, ఎన్కేపల్లి, రావులపల్లి, పలుగుట్ట, కందవాడ, గుండాల, దామరగిద్ద, తలారం, కౌకుంట్ల, అంతారం, న్యాలట, రామన్నగూడ, తదితర గ్రామాల ప్రధాన రోడ్లు అన్ని గుంతల మయంగా దర్శనమిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు చెప్పుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా గ్రామీణ రోడ్లుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



మల్కాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో పాడైన బీటీ రోడ్డు



కంకరతేలిన ముడిమ్యాల, రావులపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు

నత్త నడకే...



పామెన గేటు నుంచి పామెన, చనువెల్లి, బస్తేపూరానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. అడుగడుగనా గుంతలు, కంకరతేలి ఉండడంతో నడవాలంటేనే భయం వేస్తోంది. వాహనాల్లో వెళ్లినా నత్త నడకగా ప్రయాణం సాగించాలి.ఇప్పటికైనా స్పందించి బాగు చేయాలి.

\- విజయ్, పామెన, గ్రామస్తుడు

వాహనాలు పాడవుతున్నాయి..



గ్రామాల్లోని ప్రధాన రోడ్లు ఏళ్ల కిత్రం వేశారు. మళ్లీ ఈరోడ్లను పట్టించుకున్న వారేలేరు. బీటి రోడ్లు కాస్తా కంకర తేలి, గుంతలు ఏర్పడుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు రాత్రి సమయంలో పలు మార్లు గుంతల వల్ల కిందపడి ప్రమాదాల బారిన పడ్డారు.

\- శ్రీను, బస్తేపూర్, గ్రామస్తుడు